సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్ ద్వారా కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. 8లో



పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

జిల్లాలోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు జరిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితులు చక్కదిద్దారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. సాయంత్రం తర్వాత చలి గాలులు పెరుగుతాయి.



ఓటు వేశాక భార్య నందిని, కుమారుడు సూర్యవిక్రమాదిత్యతో సీఎల్పీ నేత భట్టివిక్రమార్క



ఓటుహక్కు వినియోగించుకున్నాక సతీమణి హృదయమీనన్‌తో సీపీ వారియర్



వృద్ధురాలికి సాయం అందిస్తున్న ఏఎస్సై వెంకటరెడ్డి



ఓటు వేయడానికి చంటిపిల్లలతో వచ్చిన మహిళలు



కామేపల్లిలో ఓటు వేసేందుకు బారులుదీరిన జనం





బోనకల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటర్ల వరుస..

ఓటు వేయడానికి వస్తున్న యువతులు

పోలింగ్ శాతం ఇలా...

నియోజకవర్గం	9గంటల వరకు	11గంటల వరకు	1గంట వరకు	3గంటల వరకు	5గంటల వరకు	మొత్తం
పాలేరు	12.54	23.64	44.98	66.17	73.13	90.28
మధిర	9.97	28.60	40.67	65.40	76.30	87.83
వైరా	8.40	22.64	46.77	66.20	79.20	86.66
సత్తుపల్లి	12.08	32.57	44.86	63.07	79.09	85.27
ఖమ్మం	10.26	23.11	39.23	59.40	65.27	71.53
మొత్తం	10.68	26.03	42.93	63.62	73.77	83.28

నోట్ : అర్ధరాత్రి వరకు అందిన సమాచారం మేరకు అధికారులు ఈ వివరాలను వెల్లడించారు. అయితే, పోలింగ్ విధులు నిర్వర్తించిన బృందాలన్నీ చేరుకున్నాక వారి డైరీల పరిశీలన అనంతరం కచ్చితమైన పోలింగ్ శాతాన్ని శుక్రవారం విడుదల చేసే అవకాశముంది.

ఓటుకు పోటెత్తారు..!

ఐదు నియోజకవర్గాల్లో 83.28 శాతంగా ఓటింగ్ నమోదు

- ఉదయం 7గంటల నుంచే బారులుదీరిన ఓటర్లు
- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్
- అభివృద్ధి జరగలేదని బహిష్కరించిన పలు గ్రామాల ప్రజలు
- కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- బందోబస్తుపై సీపీ వారియర్ పరిశీలన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గత ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పల్లె, పట్నం తేడా లేకుండా ఓటు వేసేందుకు ఆసక్తి కనబర్చగా సాయంత్రం 5గంటలకు పోలింగ్ సమయం ముగిసినా చాలా కేంద్రాల్లో బారులుదీరి కనిపించారు. దీంతో పోలింగ్ పూర్తయ్యేందుకు రాత్రి 9 గంటలు దాటింది. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించగా.. మరికొన్ని ప్రాంతాల్లో చెదురుముదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. తమ గ్రామాలను అభివృద్ధి చేయలేదని, వసతులు కల్పించలేదంటూ ప్రజలు పోలింగ్‌ను బహిష్కరించారు. అధికారులు నచ్చచెప్పడంతో వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక పాలేరు, మధిర నియోజకవర్గాల్లో పలుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఘర్షణ జరగగా పోలీస్ బలగాలు చెదరగొట్టాయి. జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ఇక సీపీ విష్ణు ఎస్.వారియర్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి బందోబస్తును పరిశీలించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగియగా అర్ధరాత్రి అధికారులు వెల్లడించిన సమాచారం మేరకు ఐదు నియోజకవర్గాల్లో 83.28శాతం పోలింగ్ నమోదైంది. అయితే, ఈ గణాంకాల్లో కొద్దిమేర మార్పులు జరిగే అవకాశముంది.

మొరాయించిన ఈవీఎంలు..

కొణిజర్ల మండలం పల్లిపాడులోని 172వ బూత్‌లో పోలింగ్ సిబ్బంది పొరపాటున క్లోజ్ బటన్ నొక్కడంతో గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. కొత్త ఈవీఎం సిద్ధం చేశాక మళ్లీ పోలింగ్ మొదలైంది. కామేపల్లి మండలంలోని పాత లింగాల నెమలిపురి పోలింగ్ బూత్‌లో 16 ఓట్లు వేశాక ఈవీఎంలు మొరాయించినా గంట తర్వాత పనిచేశాయి. ఎర్రుపాలెంలోని 231వ పోలింగ్‌బూత్‌లో ఈవీఎం లోపంతో కొద్ది సేపు పోలింగ్ నిలిచిపోయింది. రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో 11వ బూత్‌లోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు పనిచేయలేదు. అధికారులు అప్రమత్తమై సరిచేశారు. ఖమ్మంలోని రాజేంద్రనగర్ పాఠశాల 326 పోలింగ్ కేంద్రంలో ఓ ఓటరు వాంతి చేసుకోవడంతో అరగంటసేపు పోలింగ్ నిలిపివేశారు. ఆ తర్వాత శుభ్రం చేసి కొనసాగించారు.

తోపులాటలు, వాగ్వాదాలు

ఎర్రుపాలెంలోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వివాదం నెలకొంది. కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. కూసుమంచి, జీళ్లచెరువులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య వాగ్వాదం సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పోలింగ్ కేంద్రంలోకి రాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు పరస్పరం ఘర్షణకు దిగడంతో పోలీసులు లాఠీలతో చెదరగొట్టారు. కూసుమంచిలో పోలింగ్ బూత్‌లో ఓట్ల సరళిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి వచ్చారు. 'ఈ ఒక్కసారి చూడండి' అంటూ ఆయన ఓటర్లను అభ్యర్థిస్తుండడంతో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

సరళిని పరిశీలించిన అభ్యర్థులు..

ఉదయం 8గంటల్లోపే ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు పోలింగ్ సరళిని పరి శీలించేందుకు పలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, లింగాల కమల్ రాజ్, బానోతు మదన్‌లాల్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మాలోతు రాందాస్ నాయక్, మట్టా రాగమయిలు వారి నియోజకవర్గాల్లోని కేంద్రాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. అలాగే ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మువ్వా విజయ్‌బాబు, బాలసాని లక్ష్మీనారాయణ ఓటు హక్కు వినియోగించుకోవడంతోపాటు వారికి బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిని పరిశీలిస్తూ కేడర్‌కు సూచనలు చేశారు.

మేము వచ్చేది లే...

ఏన్కూరు మండలం రాజులపాలెంతో పాటు కొత్తమేడేపల్లి గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడం లేదని, అభివృద్ధి జరగలేదంటూ వారు పేర్కొనగా... అధికారులు చేరుకుని నచ్చచెప్పడంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు.

గంట గంటకూ పెరిగిన పోలింగ్

ఐదు నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. పాలేరు, సత్తుపల్లిలో ఉదయం 9గంటల్లోపు 12 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఇదే సమయానికి జిల్లావ్యాప్తంగా 10.68 శాతం నమోదైంది. ఇక 11 గంటల వరకు ఐదు నియోజకవర్గాల్లో 26.3శాతం, ఒంటి గంట వరకు 42.93 శాతం, మధ్యాహ్నం 3 గంటల వరకు 63.62 శాతం పోలింగ్ నమోదుకాగా, మొత్తంగా 83.28 శాతం ఓటింగ్ నమోదైంది. జిల్లాలోని పాలేరులో అత్యధికంగా 90.28 శాతం, ఖమ్మంలో అత్యల్పంగా 71.53 శాతం పోలింగ్ నమోదైంది.

ట్రెండ్ ఎట్లుంది..?

- అభ్యర్థులతో పాటు నేతల ఆరా
- ఎగ్జిట్‌పోల్స్ అంచనాలపై చర్చ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యాన అభ్యర్థులు, పార్టీల నేతలు అంచనాల్లో మునిగారు. పోలింగ్ ఎలా సాగింది, జనం మొగ్గు ఎటువైపు ఉంటుంది, ఏ ప్రాంతాల్లో తమకు అనుకూలంగా, ప్రతికూలంగా ఓట్లు పడి ఉంటాయనే అంశంపై ఆరా తీస్తున్నారు. మరోవైపు రాష్ట్ర స్థాయిలో ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపై కూడా చర్చ జోరుగా సాగుతోంది. సాయంత్రం ఎగ్జిట్‌పోల్ ఫలితాలు రావడంతో వాటిని స్థానిక ఓటింగ్‌కు అన్వయించుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. అలాగే, అనుచరులు, పోలింగ్ ఏజెంట్లతో చర్చించి ఓటింగ్ సరళి ఎలా సాగిందో తెలుసుకున్నారు. అంతేకాక బూత్‌ల వారీగా ఎక్కడ మెజార్టీ వస్తుంది, ఎక్కడ తగ్గుతుందని అంచనాలు వేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నా, అభ్యర్థులు మాత్రం ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయాన జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఎవరికి మెజార్టీ స్థానాలు వస్తాయన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు బరిలో ఉండడంతో వీరి గెలుపోటములపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు

పోలింగ్ ముగిశాక ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య ఆయా నియోజకవర్గాల కేంద్రాలకు.. అక్కడి నుంచి ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య (పాత కిట్స్) కాలేజీకి తీసుకొచ్చారు. ఇక్కడి స్ట్రాంగ్‌రూమ్‌ల్లో వీటిని భద్రపరిచారు. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగగా.. ఈవీఎంలను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ పర్యవేక్షణలో భద్రత మధ్య తరలించారు. ఈనెల 3న ఉదయం 8 గంటలకు ఇక్కడ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది.



భద్రాద్రి జిల్లాలో 66.04 శాతం

నియోజకవర్గం	పోలింగ్ శాతం
అశ్వారావుపేట	80.13
పినపాక	79.55
ఇల్లెందు	79.32
భద్రాచలం	78.36
కొత్తగూడెం	76.56
మొత్తం	78.66

న్యూస్‌రీల్

నేటి నుంచి నూతన మద్యం దుకాణాలు

ఖమ్మంక్రైం: జిల్లాలో శుక్రవారం నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఇందుకోసం గత సెప్టెంబర్‌లోనే మద్యం దుకాణాల ఏర్పాటుకు డ్రా ప్రక్రియ పూర్తిచేశారు. పాత షాపుల గడువు గురువారంతో ముగియగా, శుక్రవారం నుంచి జిల్లాలో 122 నూతన మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు షాపుల యజమానులు వైరాలోని మద్యం డిపో నుంచి సరుకు తెచ్చుకుంటున్నారు.

ముందుగానే క్లోజింగ్ బటన్ !

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని పల్లిపాడు పోలింగ్ కేంద్రంలో అధికారి పొరపాటుగా కంట్రోల్ యూనిట్ స్టార్ట్ బటన్‌కు బదులు క్లోజ్ బటన్ నొక్కాడు. దీంతో ఇంకా ఓటర్లు మిగిలి ఉండగానే కంట్రోల్ యూనిట్ ఫ్రీజ్ అయ్యింది. ఫలితంగా గంట పాటు పోలింగ్ నిలిచిపోగా, అధికారులు మరో కంట్రోలు యూనిట్ ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించారు.

ఏపీఓకు గుండెపోటు

కొణిజర్ల మండలం పెద్ద రాంపురం పోలింగ్ కేంద్రం ఏపీఓగా విధులకు వచ్చిన చంద్రశేఖర్‌కు గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనను గురువారం తెల్లవారుజామునే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది.

పోలింగ్ కేంద్రాల్లో వైద్య శిబిరాలు

ఖమ్మం వైద్యవిభాగం: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఈ శిబిరాలు ఏర్పాటు చేయగా, ఒక్కో శిబిరంలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను నియమించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిలో అవసరమైన వారికివైద్యసేవలు అందించారు.



జిల్లా ప్రజలకు ధన్యవాదాలు

ఓట్ల పండుగను విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు ధన్యవాదాలు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించిన పార్టీల నాయకులు, అభ్యర్థులకు కృతజ్ఞతలు. ఉదయం నుంచే వందలాది మంది కేంద్రాల్లో బారులు తీరి ఓటు వేశారు. జిల్లా ప్రజలు చైతన్యవంతులు అనడానికి పోలింగ్ సరళే నిదర్శనం. ఇది జిల్లాకు గర్వకారణం. ఎన్నికలు సజావుగా సాగేందుకు శ్రమించిన ఆరు వేల మంది పోలింగ్ సిబ్బంది, వెయ్యి మంది ఎన్నికల యంత్రాంగం, 2వేల మంది పోలీస్ సిబ్బందికి అభినందనలు. **- వీ.పీ.గౌతమ్, కలెక్టర్**



కేసీఆర్ అహంకారానికి ప్రతిఫలం..

గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో సీఎం కేసీఆర్ అనుసరించిన అహంకారపూరిత వైఖరికి ప్రతిఫలంగా ఎన్నికల ఫలితాలు రానున్నాయి. కాంగ్రెస్ సాధించే విజయం ఏ ఒక్కరిది కాదు. ఇది ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల విజయం. జిల్లాలోని 10కి 10 సీట్లు గెలవనుండడం సంతోషంగా ఉంది. రానున్న ఇందిరమ్మరాజ్యంలో ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలుచేస్తాం. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో జీవించనున్నారు. మా పార్టీకి ఓటు వేసిన ప్రతీఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు. **- పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి**



నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు..

సీఎం కేసీఆర్ ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థిగా నన్ను ప్రకటించిన నాటి నుండి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు నా విజయానికి అహర్నిశలు శ్రమించారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఖమ్మం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మరోమారు నా గెలుపు ఖాయమైంది. ఇందుకు కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిది. **- పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి**



అంతా మంచే జరుగుతుంది..

ఖమ్మం నియోజకవర్గంలో పోలింగ్ బాగా జరిగింది. ఓటర్లు చైతన్యవంతులై ఓటు వేశారు. యువత ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకోవడం ఆనందంగాఉంది. ప్రజలు ఇచ్చే తీర్పు సంతోషం, సంతృప్తికరంగా ఉంటుందని నమ్ముతున్నా. నేను ఖమ్మంలో గెలవడమే కాక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే ఆశాభావం ఉంది. **- తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి**

అంతులేని మహమ్మారి

కొన్నేళ్లుగా ఎయిడ్స్ కోరలు చాస్తోంది. ఖమ్మం జిల్లాలో గత కొన్నేళ్లుగా పరిశీలిస్తే.. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ద్వారా నివారణ చర్యలు తీసుకుంటున్నా కేసుల తక్కువగా కనిపిస్తున్నా, వ్యాప్తి మాత్రం ఆగడం లేదు. ఫలితంగా మహమ్మారి బారిన పడి ప్రతీనెల పలువురు మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు తగ్గడంతోనే వ్యాధి వ్యాప్తి చెందుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అధికారికంగానే ప్రతీనెల 40కి పైగా హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. అనధికారికంగా చాలామంది వ్యాధి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

- జిల్లాలో 16,616 ఎయిడ్స్ యాక్టివ్ కేసులు
- ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఆగని వ్యాప్తి

నేడు ప్రపంచ ఎయిడ్స్ డే

ఏటా డిసెంబర్ 1న..

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టడం, వ్యాధి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబర్ 1న ఎయిడ్స్ డే జరుపుకుంటున్నారు. ఎయిడ్స్ మహమ్మారి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మరణిస్తుండటంతో ప్రజలకు అవగాహన కల్పించడానికి 1988 నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహిస్తోంది. జిల్లాలోనూ ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే, ఇవేమీ పెద్దగా సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో వ్యాధిని నియంత్రించలేకపోతున్నారు.

నిత్యం వెలుగు చూస్తున్న కేసులు

ఖమ్మం జిల్లాలో గత ఏడాది 16,307 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉండేవారు. కానీ ప్రస్తుతం ఆ సంఖ్య మరింత పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో 16,616 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా ఖమ్మం ఏఆర్‌టీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకున్న వారే. కానీ పేర్లు నమోదు చేసుకోకుండా ఉన్న వారిని కలిపితే సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఎయిడ్స్ బాధితుల్లో 6,576 మంది ప్రతీనెల క్రమం తప్పకుండా మందులు వాడుతున్నారు. ఇందులో 2,667 మంది ఏఆర్‌టీ ఆసరా పెన్షన్ పొందుతున్నారు. తెలంగాణలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్న జిల్లాల జాబితాలో హైదరాబాద్‌తో పాటు ఖమ్మం పేరు కూడా ఉంది. జిల్లాలో ప్రతీనెల కొత్తగా సగటున 40కి పైగా పాజిటివ్ కేసులు నమోదవుతున్నట్లు అంచనా.



గత కొన్నేళ్లుగా జిల్లాలో నమోదైన ఎయిడ్స్ కేసులు

ఏడాది	కేసులు	పరీక్షలు
2019-20	631	83,788
2020-21	373	45,855
2021-22	445	47,714
2022-23	512	86,120
2023-24	309	68,088

వ్యాధి అదుపులోనే ఉంది...



జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలనకు కృషి చేస్తున్నాం. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పనిచేస్తుండగా, ప్రస్తుతానికి వ్యాధి అదుపులో ఉంది. బాధితులకు మందులు అందజేస్తూనే, కొత్తగా ఎవరూ వ్యాధి బారిన పడకుండా ర్యాలీలు, కళాజాతాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. **- డాక్టర్ ఎల్.ప్రవీణ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ, ఖమ్మం**

3,405 మంది బాధితులు మృతి

ఎయిడ్స్ వ్యాధి హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో డెఫిసియెన్సీ వైరస్) అనే వైరస్‌తో వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారి శరీరంలో రోగనిరోధక శక్తి పూర్తిగా తగ్గిపోతుంది. జిల్లాలో ఎయిడ్స్ బారిన పడి మృతి చెందే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2006 సంవత్సరం నుండి ఇప్పటి వరకు 3,405 మంది మృతి చెందగా... ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 309 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జిల్లాలో 68,808 మందికి పరీక్షలు చేయగా ఈ కేసులు నమోదైనట్లు వెల్లడైంది. ఇక 23,612 మంది గర్భిణులను పరీక్షించగా తొమ్మిది మందికి పాజిటివ్‌గానిర్ధారణ అయింది. కాగా, జిల్లాలో హైరిస్క్ ప్రవర్తన కలిగిన వ్యక్తులు, ఫీమేల్ సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ట్రాన్స్‌జెండర్ల తరఫున 'జాగృతి' స్వచ్ఛంద సంస్థ పనిచేస్తూ వారి ప్రవర్తనలో మార్పునకు యత్నిస్తోంది. జిల్లాలో ఎయిడ్స్ వ్యాధి బాధితుల కోసం నాలుగు ఐసీటీసీ కేంద్రాలు, 38 ఎఫ్‌ఐసీటీసీ కేంద్రాలు, ఒక ఏఆర్‌టీ కేంద్రం, రెండు లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, ఒక సురక్ష క్లినిక్, 10 రక్తనిధి కేంద్రాలు పనిచేస్తున్నాయి.

ఓటేసిన ప్రముఖులు..

- ఉదయమే పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన అభ్యర్థులు
- ఓటు హక్కు వినియోగించుకున్న పువ్వాడ, భట్టి, పొంగులేటి, తుమ్మల సహా అభ్యర్థులు
- కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ కూడా..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో పలు పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థులు గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొందరు అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఓట్లు వేశారు. ఖమ్మంలోని హార్వెస్ట్ స్కూల్‌లో మంత్రి, బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఖమ్మంలోని గొల్లగూడెం 257వ నంబర్ బూత్‌లో మాజీ మంత్రి, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు దంపతులు ఓటు వేశారు. సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క మధిర సుందరయ్యనగర్‌లో ఉన్న 178వ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు కల్లూరు మండలంలోని నారాయణపురంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఓటు వేశారు. వైరాలో కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్ నాయక్, మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్, కల్లూరు మండలం నారాయణపురంలో బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబ సభ్యులు, కూసుమంచి మండలం రాజుపేటలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతోకలిసిఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పాఠశాలలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం దంపతులు ఓటు వేశారు. ఖమ్మంలోని శాంతినగర్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, హృదయమీనాన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ దంపతులు జిల్లా అటవీ అధికారి కార్యాలయంలోని 195వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.


కూసుమంచి: రాజుపేటలో కుటుంబసభ్యులతో పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి



సత్తుపల్లి: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కుటుంబ సభ్యులతో బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర


తిరుమలాయపాలెం : పిండిప్రోలులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ తాతా మధు



సత్తుపల్లి: యూపీఎస్ పాఠశాలలో సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయి


కుటుంబసభ్యులతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


ఖమ్మం మయూరిసెంటర్ : ఓటేశాక కుటుంబీకులతో సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు


వైరారూరల్: కొస్టాలలో మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్


వైరా : ఓటేసిన అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్


ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో మాజీ మంత్రి రేణుకాచౌదరి


కుటుంబసభ్యులతో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

క్లుప్తంగా

పీఎల్‌జీఏ వారోత్సవాలను జయప్రదం చేయండి

జేకే–ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

చర్ల: ఈనెల 2 నుంచి 8 వరకు జరిగే పీఎల్‌జీఏ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. సూరజ్‌కుండ్ వ్యూహాత్మక దాడిని ఓడించాలని, విప్లవోద్యమాన్ని పురోగమింపజేయాలని కోరారు. ప్రజల ప్రయోజనాల కోసం ఉద్యమించాలని సూచించారు. ప్రజాపునాదిని పెంపొందించడం ద్వారా మావోయిస్టు పార్టీ పీపుల్స్ గెరిల్లా ఆర్మీ విప్లవ ప్రజానిర్మాణాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద, దళారీ, నిరంకుశ, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకుడి నుంచి నగదు స్వాధీనం

భద్రాచలంటౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఓటర్లకు పంచేందుకు తీసుకెళ్తున్న నగదును పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఓ బీఆర్‌ఎస్ నాయకుడు తీసుకెళ్తున్న రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

- పలుచోట్ల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ
- పోలీసుల చొరవతో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

కూసుమంచి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కూసుమంచి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. మండలంలోని నాయకన్‌గూడెంలో పోలింగ్ ప్రారంభ సమయంలోనే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఇరువురి మధ్య ఘర్షణలో పలువురు గాయపడగా పోలీసులు చెదరగొట్టారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించేందుకు రాగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు జై పొంగులేటి, జై కందాళ అంటూ నినాదాలు చేశారు. పొంగులేటి లోపలకు వెళ్లకుండా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకోగా, కాంగ్రెస్ కార్యకర్తలు వారిని నెట్టివేస్తుండడంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇక జీళ్లచెరువు కేంద్రాన్ని పొంగులేటి సందర్శించే క్రమంలోనూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.

- ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసుల బందోబస్తు లేకపోవడంతో రెండు సార్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇనగాలి గ్రామంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య కొంతసేపు గొడవ జరగగా, తోపులాటకు పాల్పడ్డారు. కండ్రికలో బీఆర్‌ఎస్ నాయకుడు ఇండిపెండెంట్ అభ్యర్థికి ఏజెంట్‌గా ఉండడంతో కాంగ్రెస్ ఏజెంట్లు అభ్యంతరం తెలిపారు. అయితే, నిబంధనల ప్రకారమే ఉన్నారని అధికారులు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.
- తల్లాడ: తల్లాడ మండలంలోని తల్లాడ, రామచంద్రాపురం, అన్నారుగూడెం కేంద్రాల వద్ద బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. పోలింగ్ స్టేషన్‌లో ఆవరణలో ప్రచారం చేస్తున్నారని పరస్పరం విమర్శలకు దిగారు.
- బోనకల్: బోనకల్ మండలంలోని చిరునోముల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ఘర్షణ జరగగా పోలీసులు చెదరగొట్టారు. ఆళ్లపాడులోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి కమల్‌రాజ్, స్వతంత్ర్య అభ్యర్థి బొమ్మెర రామ్మూర్తి అనుచరులు తోపులాటకు దిగారు.
- తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లి పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. దీంతో పోలీసులు సర్దిచెప్పి పంపించారు. బీరోలులో స్థానికేతరులు పోలింగ్ కేంద్రానికి వచ్చారని ఇరువర్గాలు ఆందోళన చేశాయి.
- కొణిజర్ల: కొణిజర్లలో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిశాక బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ జిల్లాపరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి రావడంతో లోపలకు వెళ్లడానికి వీల్లేదని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ పడుతుండగా మహిళా ఓటర్లు భయంతో పరుగులు తీశారు. వైరా సీఐ సాగర్ ఆధ్వర్యాన సాయుధ బలగాలు చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టి మదన్‌లాల్‌ను లోపలకు పంపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.


తిరుమలాయపాలెం : జల్లెపల్లిలో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు


బోనకల్ : ఆళ్లపాడులో ఇరువర్గాల మధ్య తోపులాట


కొణిజర్ల : మదన్‌లాల్‌ను అడ్డుకోవడంతో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు

సమస్యలు తీరిస్తేనే ఓటేస్తాం..

- పలుచోట్ల ఎన్నికలు బహిష్కరించిన ప్రజలు
- అధికారుల హామీతో పోలింగ్ కేంద్రాలకు పయనం

ఏన్కూరు: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ఏన్కూరు మండలంలోని రెండు గ్రామాల ప్రజలు బహిష్కరించారు. మండలంలోని రాజులుపాలెం, కొత్తమేడిపల్లి గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఎన్నికలు బహిష్కరిస్తున్నామని వెల్లడించారు. కొత్తమేడిపల్లిలో నీరు, విద్యుత్, రహదారితో పాటు కనీస సౌకర్యాలపై కలెక్టర్ హామీ ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే, రాజులుపాలెం వాసులు గ్రామానికి సమీపంలో ఉన్న అద్భుత వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి 10 కి.మీ. దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని, గ్రామంలో శ్మశానవాటిక కూడా లేదని నిరసన తెలిపారు. దీంతో తహసీల్దార్ శేషగిరిరావు, ఎస్‌ఐ బాదావత్ రవి వెళ్లి ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించిన గ్రామస్తులు ఓటింగ్‌లో పాల్గొన్నారు.

సత్యంపేటలో నిరసన..

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం సత్యంపేటలో ఓటర్లు నిరసనకు దిగారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ మధ్యాహ్నం 2గంటల వరకు గ్రామంలోని సుమారు 450 మంది ఓటర్లు ఇళ్ల నుంచి కదలలేదు. చివరకు స్థానిక నాయకులు వారికి సర్దిచెప్పడంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు.


ఏన్కూరు : ఎన్నికలు బహిష్కరించిన కొత్తమేడేపల్లి గ్రామస్తులు


ఏన్కూరు : ఎన్నికలు బహిష్కరించి బైఠాయించిన రాజులపాలెం గ్రామస్తులు


సత్తుపల్లి : నిరసన వ్యక్తం చేస్తున్న సత్యంపేట వాసులు

తరలివచ్చి.. ఓటేసి!

ఉద్యోగ, వ్యాపారాల రీత్యా దేశంలోని వివిధప్రాంతాల్లో వారే కాకుండా విదేశాల్లో ఉన్న వారు సైతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు. వారం, పదిరోజుల క్రితమే స్వస్థలాలకు చేరుకున్న వారు ఓటేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. రఘునాథపాలెం మండలంలోని హర్యాతండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎం.హరికిషన్ బెంగళూరు నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. ఇక వైరాకు చెందిన సీహెచ్.మాధవి టెక్సాస్ నుంచి, హరికృష్ణ అబుదాబీ నుంచి వచ్చారు. అలాగే, బెంగళూరులో ఉంటున్న ఖమ్మం రూరల్ మండలం పెదతండాకు చెందిన డాక్టర్ పెరుమాళ్లపల్లి సంధ్య తన భర్త శరత్‌చంద్రతో కలిసి వచ్చి ఓటేశారు. ఇంకా తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన ప్రత్యూష కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


రఘునాథపాలెం : బెంగళూరు నుంచి వచ్చి ఓటేసిన హరికిషన్


వైరా : టెక్సాస్ నుంచి వచ్చిన సీహెచ్.మాధవి


ఖమ్మం రూరల్ : ఓటేశాక డాక్టర్ సంధ్య దంపతులు


తల్లాడ : అమెరికా నుంచి వచ్చిన అన్నారుగూడెం వాసి ప్రత్యూష


వైరా : అబుదాబీ నుంచి వచ్చిన హరికృష్ణ

చెరువు ఖాళీ అవుతోంది..

అధికారులు స్పందించాలని రైతుల వినతి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో రోజురోజుకు నీరు అడుగంటుతోంది. ఈ విషయమై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు, మత్స్యకారులు వాపోతున్నారు. చెరువుమాధారం చెరువు షట్టర్లు కొన్నేళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో లీకేజీల ద్వారా నీరు దిగువన ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా దేవినేని వెంకటరమణ కెనాల్‌కు వెళ్తోంది. ఇదిలాగే కొనసాగితే మంగాపురం, చెరువుమాధారం, రాయగూడెం తదితర గ్రామాలకు తాగునీరే కాక ఆయకట్టులో సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు అంటున్నారు. ఇకనైనా లీకేజీలను అరికట్టాలని చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధరావత్ రాధాకృష్ణమూర్తి కోరారు. అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని హెచ్చరించారు.


భారీగా చెరువు నుంచి వెళ్తున్న నీరు

పెళ్లి బాజాలు మోగకుండానే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- పెళ్లి బట్టలు తెచ్చేందుకు వెళ్తూ అనంతలోకాలకు...

తిరుమలాయపాలెం: త్వరలో ఆ ఇంట పెళ్లిబాజాలు మోగాల్సి ఉంది. ఇంతలోనే పెళ్లి బట్టల కోసం వెళ్లిన కాబోయే వరుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు కు చెందిన పసలాది రవీందర్(24) మిషన్ భగీరథ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 7న ఆయన వివాహానికి ముహూర్తం ఖరారు కావడంతో ఖమ్మంలో పెళ్లి బట్టలు కొనుగోలు చేశారు. అయితే, ఇంటికి వచ్చే సమయాన కొన్ని బట్టలు షాపులోనే మర్చిపోవడంతో రవీందర్ తన స్నేహితుడు గణేశ్‌తో కలిసి బుధవారం రాత్రి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో తిరుమలాయపాలెం భవానీ హోటల్ సమీపాన రహదారిపై ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో రవీందర్‌కు తీవ్రగాయాలు కాగా ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందగా గణేశ్‌కు గాయాలయ్యాయి. వారంలో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు వెంకన్న – అలివేలమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, రవీందర్ కుటుంబాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పరామర్శించారు.


పసలాది రవీందర్ (ఫైల్)

భారీ బందోబస్తు.. ప్రశాంతంగా పోలింగ్

కంట్రోల్ రూమ్ నుంచే ప్రత్యక్షంగా పరిశీలించిన సీపీ

ఖమ్మంక్రైం: జిల్లాలో భారీ బందోబస్తు మధ్య జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ చిన్నచిన్న ఘటనలు మినహా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించడంలో పోలీసులు సఫలమయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా పోలీసులతో పాటు మధ్యప్రదేశ్, ఒడిశా పోలీసులకు తోడు కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించడమేకాక పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కాగా, బందోబస్తు విధుల్లో సుమారు 2వేల మంది పోలీసులు పాల్గొనగా, పోలింగ్ కేంద్రాల వద్ద 100 గజాల వరకు ఎవరూ రాకుండా కట్టుదిట్టం చేశారు.


కేంద్రం సమీపాన ఉన్న వారిని పంపిస్తున్న సీపీ వారియర్


ప్రభుత్వ మహిళా కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్..

అనుక్షణం పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల పోలింగ్ జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 822 ప్రాంతాల్లో ఉన్న 1,456 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పర్యవేక్షించారు. సీపీ విష్ణు వారియర్‌తో కలిసి కంట్రోల్ రూం ద్వారా పరిశీలించడమే కాక పలు కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు


కంట్రోల్ రూమ్ నుంచి రూట్ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్


కలెక్టరేట్ నుంచి వెబ్ క్యాస్టింగ్‌ను పర్యవేక్షిస్తున్న సిబ్బంది